https://teluguislam.net



## మొదటి దశ

# నవ సమాజ నిర్మాణం

మహాప్రవక్త (స), మదీనాలో బనూ నజ్జార్ తెగకు చెందిన హజ్రత్ అబూ అయ్యూబ్ అన్సారి (ర)గారి ఇంటి ముందు, శుక్రవారం, రబీఉల్ అవ్వల్ 12 హిజ్రీ శకం ఒకటి (27 సెప్టెంబర్, 622) రోజున వచ్చి ఆగారనీ, అప్పుడే అది ఆయన(స) విడిది అయిందీ అన్న విషయం మనకు తెలిసిందే. ఆ తరువాత ఆయన (స) అబూ అయ్యూబ్ అన్సారి (ర)గారి ఇంట ప్రవేశించారు.

## మస్జిదె నబవీ నిర్మాణం

ఆ తరువాత మహాప్రవక్త (స) మొట్టమొదటగా మస్జిదె నబవీ నిర్మాణాన్ని చేబట్టారు. ఆయన (స)గారి ఒంటె ఎక్కడైతే కూర్చున్నదో ఆ ప్రదేశమే మస్జిదె నబవీ కోసం ఎన్నుకోబడింది. ఈ స్థలం ఇద్దరు అనాథ బాలురకు చెందిన స్థలం. మహాప్రవక్త (స) దాన్ని ఆ ఇద్దరికి డబ్బిచ్చి కొన్నారు. స్వయంగా మస్జిద్ నిర్మాణంలో పాల్గొంటూ, ఇటుక రాళ్ళు మోయనారంభించారు. అలా మోస్తూనే ఇలా ప్రార్థించనారంభించారు.

"ఓ అల్లాహ్! జీవితం కేవలం పరలోక జీవితమే, ఓ ప్రభూ! అన్సారులను, ముహాజిర్లను మన్నించు." ఇంకా ఇలా పలికేవారు కూడా.

"ఈ బరువు ఖైబర్ బరువు కాదు. మా ప్రభువు సాక్షి! ఇది ఎంతో పుణ్యకార్యం, మరెంతో పవిత్ర కార్యం కూడాను."

మహాప్రవక్త (స)గారి ఈ పని చేసే తీరును చూసి సహాబాల్లో ఉత్సాహం మరింత పెరిగిపోయేది. సహాబా (ర) ఇలా చెప్పుకునేవారు.

"దైవప్రవక్త (స) పని చేస్తూ ఉండగా మనం చూస్తూ కూర్చుంటే ఇది మనల్ని మార్గభ్రష్టుల్ని చేసెయ్యగలదు."

ఈ స్థలంలో బహుదైవారాధకుల సమాధులు కొన్ని ఉన్నాయి. కొంత ఖాళీ ప్రదేశం కూడా ఉంది. ఖర్జూరం మరియు గర్ఖద్ చెట్లు కూడా కొన్ని

https://teluguislam.net



ఉన్నాయి. మహాప్రవక్త (స), బహుదైవారాధకుల సమాధుల్ని పెకిలించివేయించారు. ఖాళీ ప్రదేశాన్ని చదును చేయించారు. ఖర్జూరపు చెట్లను పెకిలించి ఖిబ్లా వైపు నాటించారు - అప్పుడు బైతుల్ మగ్దిస్ ఖిబ్లాగా ఉండేది - గుమ్మం రెండు ప్రక్కల పునాదులు రాతితో కట్టారు. గోడలు పచ్చి ఇటుకలు, మట్టితో నిర్మించ బడ్డాయి. పైకప్పుగా ఖర్జూరపు ఆకుల్ని, మట్టల్ని వేసి కప్పారు. స్తంభాలు ఖర్జూరపు కాండాలు, నేలపై ఇసుక మరియు సన్నటి కంకర రాళ్ళు పరచ బడ్డాయి. ద్వారాలు మొత్తం మూడు. ఖిబ్లా వైపు గోడ నుండి వెనుక వైపు ఉన్న గోడ మధ్య దూరం వంద మూరలు. వెడల్పు కూడా దాదాపు అంతే లేదా కొంచెం తక్కువ. పునాది దాదాపు మూడు మూరల లోతు ఉంది.

దైవప్రవక్త (స) మస్జిద్ ప్రక్కగా కొన్ని ఇండ్లను కూడా నిర్మించారు. వాటి గోడలు కూడా పచ్చి ఇటుకలే. పైకప్పు కూడా ఖర్జూరపు బోదెల కమ్మీలు మరియు ఖర్జూరపు ఆకులతో నిర్మించడం జరిగింది. ఇవే మహాప్రవక్త (స) గారి సతీమణుల హుజ్రాలు (గదులు). ఈ హుజ్రాల నిర్మాణం పూర్తి అయిన తరువాత దైవప్రవక్త (స) అబూ అయ్యూబ్ అన్సారి (ర)గారి ఇంటి నుంచి వీటిలోనికి మారారు.[1]

మస్జిద్ కేవలం నమాజు చేసుకోవడానికే కాదు. అదో యూనివర్సిటి కూడాను. ఇందు ముస్లిములు ఇస్లామీయ బోధనలను అధ్యయనం చేసేవారు. ఇదో సమావేశ కేంద్రం కూడా. ఇందు సంవత్సరాల తరబడి అజ్ఞాన కాలంనాటి మారణకాండ, వైషమ్యం, పరస్పర యుద్ధాల్లో నిమగ్నమై ఉండిన తెగలకు చెందిన వ్యక్తులు వాటిన్నిటిని మరచిపోయి పరస్పరం ప్రేమాను రాగాలతో కలసిమెలసి ఉండేవారు. ఇదే కాదు, అది ఈ చిన్న రాజ్యాన్ని నడిపే వ్యవస్థకు కేంద్రం కూడాను. అక్కడి నుండే రకరకాల ముఖ్యకార్యాలను నిర్వహించడానికి ప్రతినిధి బృందాలను పంపించడం జరిగేది. అదేకాకుండా ఈ మస్జిద్ స్థాయి ఓ పార్లమెంటు లాంటిది. ఇక్కడ సలహా సంఘం మరియు వ్యవస్థాగతమైన సమావేశాలు కూడా జరిగేవి.

వీటన్నిటికితోడు ఈ మస్జిద్, నిలువనీడలేని, భార్యాపిల్లల్ని పోగొట్టుకున్న నిరుపేద నిర్భాగ్యులు తలదాచుకునే స్థలం. వారంతా ముహాజిర్లే. మక్కా నుండి హిజ్రత్ చేసి వచ్చినవారే.

---

1. సహీ బుఖారి-1/71,555,560 - జాదుల్ ముఆద్-2/56

https://teluguislam.net



హజ్రత్ చేసి వచ్చిన తొలి రోజుల్లో అజాన్ పిలుపు కూడా ఆరంభమైంది. ఇది అయిదు పూటలు మదీనాలో మారుమ్రోగేది. ఈ అజాన్ పిలుపు విన్నంతనే మదీనా జీవితం ఒక్కసారే స్థాణువై వినేది. ఈ అజాన్ విషయంలో హజ్రత్ అబ్దుల్లా బిన్ జైద్ బిన్ అబ్దర్‌బా (ర)గారి స్వప్న వృత్తాంతం చెప్పుకోదగింది. (వివరాలు జామె తిర్మిజీ, సునన్ అబూ దావూద్, ముస్నదె అహ్మద్ మరియు సహీహ్ ఇబ్నె ఖుజామాల్లో చూడవచ్చు.)

## ముస్లిముల సౌభ్రాతృత్వం

మస్జిదె నబవీని నిర్మించి దైవప్రవక్త (స), ముస్లిముల్లో కలుపుగోలుతనాన్ని, ప్రేమైక వాతావరణాన్ని సృష్టించే ఓ కేంద్రాన్ని నెలకొలిపినట్లే, ముహాజిర్లు మరియు అన్సారుల నడుమ సోదరభావాన్ని, ఐకమత్యాన్ని పెంపొందించే మరో కార్యాన్ని కూడా చేబట్టారు. మానవ చరిత్రలోనే ఇది ఉజ్వలమైన ఘన కార్యమని చెప్పుకోవడం జరుగుతోంది. ఇబ్నె ఖైమ్ తన గ్రంథంలో ఇలా చెబుతారు.

"తరువాత మహాప్రవక్త (స), హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (ర)గారి ఇంటిలో ముహాజిర్లు మరియు అన్సారుల నడుమ సౌభ్రాతృత్వాన్ని నెలకొల్పారు. వారు మొత్తం తొంభై మంది. సగం మంది ముహాజిర్లు మరి సగం మంది అన్సారులు. ఆ సౌభ్రాతృత్వం ప్రకారం, వారు పరస్పరం ఒకరి కష్ట సుఖాల్లో మరొకరు పంచుకోవాలి. మరణం తరువాత రక్తసంబంధీకులైన బంధువులకు బదులు ఒకరికొకరు వారసులైపోవాలి. ఇది ఆ సౌభ్రాతృత్వానికి సంబంధించిన మౌలిక అంశం. అయితే వారసత్వానికి సంబంధించిన ఈ ఆదేశం బద్ర్ యుద్ధం తరువాత ఈ దివ్యవాణి (వహీ) అవతరించనంత వరకు కొనసాగుతూనే ఉంది.

وَأُولُوا الْأَرْحَامِ بَعْضُهُمْ أَوْلَىٰ بِبَعْضٍ

> "కాని, అల్లాహ్ గ్రంథం ప్రకారం, సాధారణ విశ్వాసులు మరియు వలస వచ్చిన వారికంటే రక్తసంబంధీకులు ఒకరిపై ఒకరు ఎక్కువ హక్కును కలిగి ఉంటారు." (33 : 6)

అప్పుడుగాని అన్సార్ మరియు ముహాజిర్లలో వస్తున్న వారసత్వ సంబంధమైన ఆదేశం రద్దు అయిపోయింది. కాని సౌభ్రాతృత్వం గురించి వారు

https://teluguislam.net



చేసిన ప్రమాణం మాత్రం మిగిలే ఉంది. మహాప్రవక్త (స) మరో సుహృద్భావ ఒప్పందం కూడా చేయించారు అని చెప్పుకోవడం జరుగుతోంది. ఆ ఒప్పందం ముహాజిర్లకూ ముహాజిర్లకూ మధ్య చేయించిన ఒప్పందం. అయితే ఈ విషయంలో ముహాజిర్లకు ముహాజిర్లకు నడుమ కావలసిన ఇస్లామీయ సౌభ్రాతృత్వం, ఐకమత్యం విషయంలో అలాంటి ఒప్పందం అవసరం కూడా లేదు. కాని ముహాజిర్ల వ్యవహారం వేరు, అన్సారుల వ్యవహారం వేరు.[2]

ఈ సౌభ్రాతృత్వ ధ్యేయం- ముహమ్మద్ గజాలి రాసినట్లు - అజ్ఞాన దురభిమానాలు పటాపంచలైపోవాలని, ఆత్మాభిమానంగాని, గౌరవభావంగాని పూర్తిగా ఇస్లామ్‌కే చెందాలని, జాతి, వంశం, రంగు, దేశానికి సంబంధించిన తారతమ్యాలన్నీ సమసిపోవాలన్నదే. ప్రజల్లో పాతుకుపోయిన ఔన్నత్యం మరియు నీచత్వపు భావనలను కొలిచే కొలమానం కేవలం మానవత్వం మరియు దైవభీతే కావాలన్నది.

దైవప్రవక్త (స) ఈ సౌభ్రాతృత్వాన్ని కేవలం మాటల మటుకే సరిపెట్ట లేదు. దాన్ని రక్తం మరియు ధనంతో సంబంధం గల ఓ ఆచరణాత్మకమైన ప్రమాణంగా ఖరారు చేశారు కూడా. శ్లాఘించడానికి ఇది ఉత్త ఇస్లామీయ శుభాకాంక్షలు కావు. ఈ ఐకమత్యంలో త్యాగం, ప్రేమభావాలు కూడా మిళితమై ఉన్నాయి. కాబట్టే ఆ సౌభ్రాతృత్వపు ప్రమాణం, ఈ నవ సమాజాన్ని ఉజ్వలమైన ఘనకార్యాలతో నింపేసింది.[3]

సహీ బుఖారీ గ్రంథంలో ఇలా ఉంది:

"మహాప్రవక్త (స) మదీనాకు అరుదెంచిన తరువాత హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (ర) గారికీ మరియు హజ్రత్ సఅద్ (ర) బిన్ రబీయా గారికి నడుమ సౌభ్రాతృత్వాన్ని నెలకొలిపారు. ఆ తరువాత హజ్రత్ సఅద్(ర), అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (ర)గారితో, అన్సారుల్లోకెల్లా ధనవంతుణ్ణి నేనే. మీరు నా సొత్తును రెండు భాగాలుగా చేసి (సగం) తీసుకోండి. నాకు ఇద్దరు భార్యలు. మీరు వారిని చూసుకోండి. వారిలో మీకు ఎవరు నచ్చారో చెప్పండి. ఆమెకు తలాక్ ఇచ్చి ఇద్దత్ కాలం గడిచిన తరువాత మీకిచ్చి వివాహం చేసేస్తాను" అని అన్నారు. దానికి అబ్దుర్రహ్మాన్ (ర), "అల్లాహ్ మీ సంతానాన్ని, మీ ధనాన్ని వృద్ధిపరచుగాక. మీ సంత ఎక్కడుంది?" అని అడిగారు. ఆయనకు 'బనీ

---

2. జాదుల్ ముఆద్-2/56

3. ఫిక్కతుసీరత్- పుట.140,141

https://teluguislam.net



ఖునైకా' సంతను చూపెట్టడం జరిగింది. అక్కడికి వెళ్ళి తిరిగి వచ్చేటప్పుడు ఆయన చేతిలో జున్ను మరియు నెయ్యి పాత్ర లున్నాయి. అలా ఆయన రోజూ సంతకు వెళ్ళి వచ్చేవారు. ఓ రోజు ఆయన ప్రవక్త (స) సన్నిధికి వచ్చి నప్పుడు ఆయన వస్త్రాలపై పసుపు రంగు ఛాయలు కనబడుతున్నాయి. "అదేమిటీ?" అని దైవప్రవక్త (స) ఆయన్ను ప్రశ్నించగా, "నేను వివాహం చేసుకున్నాను" అని బదులిచ్చారు.

"మహర్ ఎంత కట్టారూ?" అని అడిగారు మహాప్రవక్త (స).

"ఓ నవాహ్ (ఖర్జూరపు గింజ) బరువు బంగారం (అంటే ఒకటింబావు తులం)" అని బదులిచ్చారు.[4]

ఇలాగే హజ్రత్ అబూ హురైరా (ర)గారి ఉల్లేఖనం ఒకటుంది. దాని ప్రకారం, అన్సార్‌లు దైవప్రవక్త (స) గారి వద్దకు వచ్చి, "తమరు మాకు, మా ఈ (ముహాజిర్) సోదరులకు మధ్య మా ఖర్జూరపు తోటల్ని పంచెయ్యండి" అని అడిగారు. దానికి మహాప్రవక్త (స) "అలా జరుగదు" అని అనగా, "సరే" మా పనులను చేయమనండి, వారిని మా పంటలో భాగస్వాములుగా చేస్తాం" అని అన్నారు. దానికి "సరే" అని ఒప్పుకోవడం జరిగింది.[5]

అన్సార్‌లు తమ ముహాజిర్ సోదరులను ఎలా గౌరవించారో, వారి ఎడల ప్రేమ, వాత్సల్యం మరియు త్యాగాలను ఎలా ప్రదర్శించారో ఈ రెండు సంఘటనల ద్వారా అర్థం చేసుకోవచ్చు. అలాగే ముహాజిర్లు కూడా వీరి ఈ తెగువకు, త్యాగానికి ఎంత విలువనిచ్చి గౌరవించారో తెలుస్తోంది. అన్సార్‌లు చేసిన ఈ త్యాగాన్ని ఆసరాగా చేసుకొని ఇష్టమొచ్చినట్లు ప్రయోజనం పొందే ప్రయత్నం చేయలేదు వారు. కేవలం దిగజారిన తమ ఆర్థిక పరిస్థితిని చక్కబెట్టుకోడానికిగాను దానికి తగ్గట్లుగానే అన్సార్‌ల నుండి ప్రయోజనం పొందారు.

ఈ సౌభ్రాతృత్వపు ప్రమాణం, ఓ అమూల్యమైన వివేచనా కార్యం, దూరదృష్టితో కూడిన రాజకీయ చతురత మరియు ముస్లిములు ఎదుర్కొంటున్న అనేక క్లిష్టమైన సమస్యలకు పరిష్కారం కూడా అని చెప్పవచ్చు.

---

4. సహీ బుఖారి-ముహాజిర్లు మరియు అన్సారుల నడుమ ఐకమత్యం అనే అధ్యాయం-1/302
5. సహీ బుఖారి-1/312

https://teluguislam.net



## ఇస్లామ్ మార్గంలో పరస్పరం సహాయ సహకారాలు అందించుకునే ప్రమాణం

పైన జరిగిన సౌభ్రాతృత్వంలాగే మహాప్రవక్త (స), ముస్లిములందరి చేత మరో ప్రమాణం కూడా చేయించారు. ఈ ప్రమాణం ద్వారా ఇప్పటి వరకు వారిలో వ్రేళ్ళూనుకుని ఉన్న అజ్ఞాన కాలపు రక్తపాతం అంతమైపోయింది. తెగల నడుమగల సంఘర్షణ పునాదులు పూర్తిగా పెకలించబడ్డాయి. ఇక అజ్ఞాన కాలంనాటి ఆచార సంప్రదాయాలకు ఏమాత్రం చోటు లేకుండా పోయింది. దిగువన ఆ ప్రమాణంలోని ముఖ్యాంశాలను టూకీగా వివరించ డానికి ప్రయత్నం చేస్తున్నాం.

ఆ ప్రమాణ పత్రంలో ఇలా రాయబడి ఉంది:

"ఖురైష్‌కు చెందిన ముస్లిములు, యస్రిబ్ ముస్లిములు కలసి దైవప్రవక్త (స)ను విధేయించడానికి, ఆయనతో కలసి జిహాద్ చేయడానికిగాను వారికి, అల్లాహ్ ప్రవక్త (స)కు నడుమ జరిగిన ప్రమాణమేమనగా!

1. వీరందరూ తక్కిన వారికి భిన్నమైన ఓ ప్రత్యేక సమాజం.
2. హిజ్రత్ చేసివచ్చిన ఖురైష్‌లు తమ గత పరిస్థితికి అనుగుణంగా 'దైత్' (రక్తపరిహారం) చెల్లిస్తారు. మోమిన్‌ల (విశ్వాసుల) నడుమ ప్రసిద్ధమైన రీతిలో, న్యాయబద్ధంగా తమ ఖైదీల పరిహారం చెల్లిస్తారు. అలాగే అన్సార్‌కు చెందిన తెగలన్నీ తమ గత స్తోమతనుబట్టి పరస్పరం 'దీత్' చెల్లిస్తారు. వారిలోని ప్రతి వర్గం ప్రసిద్ధమైన రీతిలో, విశ్వాసుల నడుమ న్యాయబద్ధంగా తమ ఖైదీలను ఫిదియా ఇచ్చి విడిపించుకుంటారు.
3. విశ్వాసులు తమ సమాజంలో, ఏ దీనుణ్ణయినా, ఫిదియా లేదా దీత్ విష యంలో ప్రసిద్ధమైన రీతిలో సహాయాన్ని అందించకుండా ఉండడానికి వీల్లేదు.
4. సదాచార సంపన్నులైన ముస్లిములంతా కలసి, వారిపై దౌర్జన్యం చేసే వానికి లేదా ముస్లిమ్ సమాజంలో జులుము, దుర్మార్గాలను, కల్లోలా లను రేకెత్తించేవానికి వ్యతిరేకంగా పోరాడాలి.
5. ఈ విషయంలో ఆ దుర్మార్గానికి పాల్పడిన వాడు వారి కుమారుడైనా సరే అందరూ అతనికి వ్యతిరేకంగా చర్య తీసుకోవలసి ఉంటుంది.

https://teluguislam.net



6. ఓ విశ్వాసి మరో విశ్వాసిని కాఫిర్‌కు (దైవ తిరస్కారికి) బదులుగా సంహ రించడానికి వీల్లేదు.
7. ఓ విశ్వాసికి వ్యతిరేకంగా ఏ కాఫిర్‌కైనా సహాయం చేయడానికి వీల్లేదు.
8. అల్లాహ్‌తో చేసిన ప్రమాణం అందరికీ వర్తిస్తుంది. ఓ మామూలు మనిషి ఇచ్చిన మాటకు ముస్లిములందరూ కట్టుబడి ఉంటారు.
9. ఏ యూదులైతే మనకు విధేయత చూపుతున్నారో వారికి సహాయం అందించడం జరుగుతుంది. వారిని కూడా ఇతర ముస్లిముల్లాంటి వారు గానే భావించడం జరుగుతుంది. వారిపై ఎలాంటి జులుముగానీ, వారికి వ్యతిరేకంగా మరెవ్వరికి సహాయం చేయడంగానీ జరగదు.
10. ముస్లిముల సంధి ఒప్పందం అందరికీ వర్తిస్తుంది. ఏ ముస్లిమైనా మరొక ముస్లిమును కాదని దైవమార్గంలో జిహాద్ చేసే విషయంలో సంధి కుదుర్చుకోడానికి వీల్లేదు. సరికదా, అందరు కలిసే సమానత్వం మరియు న్యాయసూత్రాల ప్రాతిపదికపైన్నే ఒప్పందం చేసుకోవలసి ఉంటుంది.
11. దైవమార్గంలో చిందించిన రక్తం విషయంలో ముస్లిములంతా సమాన భాగస్వాములుగానే ఉంటారు.
12. ఏ ముస్లిమైనా, బహుదైవారాధకుడైన ఖురైష్ ధనప్రాణాలను రక్షించే ప్రయత్నం చేయడంగాని, అతణ్ణి రక్షించడానికి మరో ముస్లిమ్‌కు అడ్డుగా నిలవడానికిగానీ వీల్లేదు.
13. ఎవరైనా ఓ ముస్లిమును హత్య చేసినప్పుడు, దానికి సరైన ఆధారం లభిస్తే అతని నుండి ఖిసాస్ తీసుకోవడం జరుగుతుంది. హతుని సంరక్ష కుడు దాన్ని మాఫీ చేస్తే తప్ప.
14. అలా చేసిన వానికి వ్యతిరేకంగా ముస్లిములంతా నిలబడవలసి ఉంటుంది. అతణ్ణి వ్యతిరేకించడం తప్ప మరే విషయమూ వారికి ధర్మ సమ్మతం కాజాలదు.
15. ఏ విశ్వాసికైనా, ఉపద్రవాన్ని లేవనెత్తేవానికి (బిద్అతీకి) సహాయపడటం అనేది ధర్మసమ్మతం కాజాలదు. ఎవరైనా అలాంటి వ్యక్తికి సహాయ పడడంగానీ, అతణ్ణి తన రక్షణలోకి తీసుకోవడంగానీ జరిగితే ప్రళయం

https://teluguislam.net



రోజు అతనిపై అల్లాహ్ ఆగ్రహశాపాలు విరుచుకుపడతాయి. అతని ఫర్జులు, నఫిల్ ఆరాధనలేవీ స్వీకరించబడవు.

16. మీ నడుమ ఏవైనా అభిప్రాయభేదాలు పొడసూపితే వాటిని అల్లాహ్ మరియు ముహమ్మద్ (స) వైపునకు మళ్ళించి వారి తీర్పును శిరసా వహించవలసి ఉంటుంది.[6]

## సమాజంపై పడిన ఆధ్యాత్మిక ప్రభావం

ఈ దూరదృష్టి, వివేచనల పైన్నే దైవప్రవక్త (స) ఓ నవ సమాజ నిర్మాణ పునాదులు వేయడం జరిగింది. అయితే, దైవప్రవక్త (స) గారి సహచర్యంలో ఈ మహామహులు పొందిన తర్ఫీదు, శిక్షణలు ఈ సమాజపు బాహ్య కోణాలకు ప్రతిబింబాలుగా నిలిచాయి. వారి ఆత్మప్రక్షాళన కోసం, వారి శిక్షణ కోసం, వారి నైతికతా విలువలను పెంపొందించడం కోసం మహాప్రవక్త (స) ఎల్లవేళలా సంసిద్ధులై ఉంటూ ఉండేవారు. వారికి ప్రేమా సౌభ్రాతృత్వం, ఐకమత్యం, గౌరవం మరియు ఆరాధనా విధేయతల సూత్రాలను నేర్పేవారు.

ఓ సహాబీ (ర) (అనుచరుడు), ఏ ఇస్లామ్ ఉత్తమమైనది? (అంటే ఇస్లామ్‌లో నడవడికలో ఏది మిన్న అయినది?) అని అడిగినప్పుడు ఆయన (స), "నీవు అన్నదానం చెయ్యి, ఎరిగినవారికీ, ఎరుగనివారికీ కూడా సలామ్ చేస్తూ ఉండు"[7] అని ఉద్బోధించారు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ సలామ్ (ర)గారి ఒక ఉల్లేఖనం ఇలా ఉంది.

"మహాప్రవక్త (స) మదీనాకు అరుదెంచినప్పుడు నేను ఆయన సన్నిధికి హాజరయ్యాను. ఆయన (స) ముఖారవిందాన్ని చూడగానే, ఇది ఓ అసత్యవాది ముఖం కాజాలదు అనే నిర్ణయానికి వచ్చాను. ఆ తరువాత నేను ఆయన నోట విన్న ప్రప్రథమ సూక్తి ఏదంటే;

"ప్రజలారా! సలామును వ్యాపింపజేయండి. భోజనాలు పెడుతూ ఉండండి. బంధువుల పట్ల సద్వర్తనతో మెలగండి. రాత్రి ప్రజలు నిద్రిస్తున్నప్పుడు నమాజు చేయండి. అప్పుడు మీరు స్వర్గంలో ప్రశాంతంగా ప్రవేశించగలరు."[8]

---

*6. ఇబ్నె హిషామ్-1/502, 503* *7. సహీ బుఖారి-1/6,9*

*8. తిర్మిజి, ఇబ్నె మాజ, దారమి, మిష్కాత్-1/168*

https://teluguislam.net



మచ్చుకు అలాంటి బోధనలే కొన్నిటిని ఇక్కడ పొందుపరుస్తున్నాం.

"ఎవరి దురాగతాల నుండి, ఆగడాల నుండి అతని పొరుగువాడు సంరక్షింపబడలేడో ఆ వ్యక్తి స్వర్గంలో ప్రవేశింపజాలడు."[9]

"ఎవరి నోటి ద్వారా, చేతి ద్వారా ముస్లిములకు రక్షణ లభిస్తుందో అతనే ముస్లిమ్."[10]

"విశ్వాసులంతా ఒకే శరీరంలాంటివారు. కంటిలో బాధగా ఉంటే శరీరం మొత్తానికి బాధ కలుగుతుంది. తలలో బాధగా ఉంటే శరీరాన్నంతటికి బాధ కలుగుతుంది."[11]

"తనకు నచ్చిన వస్తువునే తన సోదరుని కోసం ఎంచుకోనంత వరకు ఏ వ్యక్తి అయినా ముస్లిముగా ఉండలేడు." [12]

"ఓ విశ్వాసి మరో విశ్వాసి విషయంలో ఓ కట్టడంలాంటివాడు. ఈ కట్టడంలోని ప్రతి భాగం మరో భాగానికి బలం చేకూరుస్తుంది."[13]

"ఒకరికి మరొకరి ఎడల పరస్పరం వైషమ్యం ఉండకూడదు. పరస్పరం ఈర్ష్య పడకండి. ఒకరిని చూసి మరొకరు ముఖం త్రిప్పుకోకండి. అల్లాహ్‌కు దాసులై పరస్పరం సోదరులుగా మెలగండి. ఏ ముస్లిమైనా మూడు రోజుల కంటే ఎక్కువగా తన సోదరునితో మాట్లాడకుండా ఉండడానికి వీల్లేదు." [14]

"ఓ ముస్లిమ్ మరో ముస్లిమ్‌కు సోదరుడు. అతడు అతనిపై జులుము చేయడంగానీ, అతణ్ణి అతని శత్రువుకు అప్పజెప్పడంగానీ జరగకూడదు. ఏ వ్యక్తి అయితే తన సోదరుని అవసరం తీర్చడానికి తాపత్రయపడతాడో అల్లాహ్ అతని అవసరాన్ని తీరుస్తాడు. మరే ముస్లిమైతే మరో ముస్లిమ్ యొక్క దుఃఖాన్ని పారద్రోలగలడో, అల్లాహ్ ప్రళయదినం నాడు కలిగే దు:ఖాల్లో ఏదో ఒక దుఃఖాన్ని దూరం చేయగలడు. ఏ ముస్లిమైతే మరో ముస్లిమ్ యొక్క లోపాలను దాస్తాడో, అల్లాహ్ ప్రళయ దినాన అతని లోపాలను దాస్తాడు." [15]

"భూవాసులపైన కరుణించండి. మిమ్మల్ని ఆకాశవాసి కరుణిస్తాడు."[16]

---

*9. సహీ ముస్లిమ్, మిష్కాత్-2/422*
*10. సహీ బుఖారి-1/6*
*11. ముస్లిమ్, మిష్కాత్-2/422*
*12. సహీ బుఖారి-1/6*
*13. ముత్తఫిఖున్ అలైహి-మిష్కాత్-2/422; సహీ బుఖారి-2/890*
*14. సహీ బుఖారి-2/896*
*15. ముత్తఫిఖున్ అలైహి, మిష్కాత్-2/422*
*16. సునన్ అబూ దావూద్-2/335; జామె తిర్మిజీ-2/14*

https://teluguislam.net



"తన పొరుగువాడు పస్తు ఉండగా, తాను కడుపార భుజించువాడు విశ్వాసి కాజాలడు."[17]

"ముస్లిమును తిట్టడం, దుర్భాషలాడడం 'ఫిస్క్' (మహాపాపం), అతనితో తలపడడం, దెబ్బలాడడం 'కుఫ్ర్' (అవిశ్వాసం)."[18]

ఇలాగే ఆయన (స), "మార్గంలో పడి ఉన్న ప్రజలను కష్టపెట్టే వస్తువును తొలగించడాన్ని దానంగా, విశ్వాసంలోని ఓ భాగంగాను ఎంచేవారు."[19]

అదే విధంగా మహాప్రవక్త (స), దానధర్మాలను చేయడానికి ప్రోత్సహించేవారు. దానికోసం లభించే పుణ్యఫలాలను ఏకరువు పెట్టడం వలన ప్రజల హృదయాలు ఆయన వైపునకు మొగ్గుజూపేవి. ఈ విషయంలో ఆయన ప్రవచనం ఇలా ఉంది: "నీరు అగ్నిని చల్లార్చినట్లు, దానం పాపాలను భస్మం చేస్తుంది." [20]

"ఏ ముస్లిమైతే నగ్న ముస్లిములకు వస్త్రాలు తొడుగుతాడో, అల్లాహ్ అతనికి స్వర్గంలో ఆకుపచ్చ రంగు గల వస్త్రాలను తొడుగుతాడు. మరే ముస్లిమైతే ఆకలితో బాధపడే ముస్లిమ్‌కు అన్నం పెడతాడో, అల్లాహ్ అతనికి స్వర్గ ఫలాలను తినిపిస్తాడు. ఇంకా ఏ ముస్లిమైతే దాహార్తి అయిన ఒక ముస్లిమ్ దాహాన్ని తీరుస్తాడో అల్లాహ్ అతనికి స్వర్గంలో సీలు వేయబడిన పరిశుద్ధ మధువును త్రాగిస్తాడు."[21]

"నరకాగ్ని నుండి తప్పుకోండి. ఓ ఖర్జూరపు ముక్కను దానం చేసి అయినా సరే. అది కూడా లేకపోతే ఓ పరిశుద్ధమైన మాట పలికి అయినా సరే."[22]

దీనికి తోడు దైవప్రవక్త (స) యాచన చేయకుండా జాగ్రత్తపడండని బోధించారు. సహనానికీ, పొదుపుకూ లభించే పుణ్యఫలం గురించి వివరించేవారు. ఇతరుల ముందు చేయిజాపి యాచించడాన్ని అతని ముఖంపై పడే గాట్లుగా అభివర్ణించేవారు.[23] అయితే నిజంగానే వివశుడైపోయి యాచించే వ్యక్తి ఆ కోవకు చెందడని చెప్పేవారు.

ఆరాధనలకు లభించే పుణ్యఫలాలు, దైవం దృష్టిలో వాటికి ఉన్న

---

17. షొఅబుల్ ఈమాన్ లిల్ బైహీకీ
18. సహీ బుఖారి-2/893
19. మిష్కాత్-1/12, 167
20. అహ్మద్, తిర్మిజీ, ఇబ్నెమాజా, మిష్కాత్-1/14
21. సునన్ అబూదావూద్, జామె తిర్మిజి, మిష్కాత్-1/169
22. సహీ బుఖారి-1/190, 2/890
23. అబూ దావూద్, తిర్మిజీ, నిసాయి, ఇబ్నె మాజా, దారిమీ, మిష్కాత్-1/163

https://teluguislam.net



విలువ, లభించే ప్రతిఫలం గురించి కూడా విడమర్చి చెప్పేవారు, ఆకాశం నుండి అవతరించే దైవవాణితో ముస్లిములు దృఢమైన సంబంధం ఏర్పర్చుకునేటట్లు చేసేవారు. ఆయన (స) ఆ దైవవాణిని చదివి వినిపించే వారు. ముస్లిములు కూడా దాన్ని దైవప్రవక్త (స) ఎదుట చదివి వినిపించేవారు. దీని ద్వారా వారిలో ఆలోచన, అవగాహనే కాకుండా సత్యధర్మ ప్రచార బాధ్య తలు మరియు దైవదౌత్య బాధ్యతలు ఏవో బాగా నాటుకుపోయేవి.

అలాగే దైవప్రవక్త (స) ముస్లిముల ఆధ్యాత్మిక శక్తిని పెంపొందించి, వారి దైవదత్తమైన సామర్థ్యాలను బయటకు తీసి వారిలో ఓ ఉన్నత అధికార పాటవాన్ని ఏర్పర్చగలిగారు. చివరికి వీరు మానవ చరిత్రలోనే దైవప్రవక్తల తరువాత ఉన్నత స్థానాన్ని ఆక్రమించగలిగారు. హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (ర) ఇలా చెబుతూ ఉండేవారు

"ఏ వ్యక్తి అయినా ఓ మార్గాన్ని అవలంబించవలసివస్తే వారు గతించిన వీరి మార్గాన్నే అనుసరించాలి. ఎందుకంటే, సజీవంగా ఉన్న వారి వల్ల తప్పులుదొరలే భయం ఉంది గనుక.

వీరంతా దైవప్రవక్త (స)కు తోడుగా ఉన్నవారు. ఆయన అనుచరగణం. ఈ సమాజంలో అత్యుత్తములైన వ్యక్తులు, అందరికంటే మిన్న అయిన సదాచార సంపన్నులు. అందరికంటే ఉత్తమ విజ్ఞాన ధనులు. కలుపుగోలు తనంగల మనుషులు. అల్లాహ్ వారిని తన ధర్మస్థాపనం కోసం, దైవప్రవక్త(స) సహచర్యం కోసం ఎంచుకున్నాడు. అందుకని వారి ఔన్నత్యాన్ని గుర్తించండి. వారి అడుగుజాడల్లో నడవండి. సాధ్యమైనంత వరకు వారి నైతిక విలువలను, వారి సచ్చరితాన్ని అవలంబించండి. ఎందుకంటే వారు రుజుమార్గంపై నడిచి మార్గదర్శకులయ్యారు గనుక."[24]

అదే కాదు, మన ప్రవక్తశ్రీ(స), మహా నాయకుడు(స) స్వయంగా ఈ ఆధ్యాత్మిక చింతనలు, అందరికీ అగుపడే సుగుణాలు, దైవదత్త సామర్థ్యాలు, గుణగణాలు, నైతిక విలువలు, సదాచార సంపన్నతలు కలిగి ఉన్నవారు. ఆయన ఈ మూర్తిమత్వం కారణంగా హృదయాలు ఇట్టే ఆయన వైపునకు అనుకోకుండానే మొగ్గిపోయేవి. ఆయన కోసం ప్రాణాలను సైతం త్యాగం

24. జరీన్, మిష్కాత్-1/32

https://teluguislam.net



చేయడానికి సిద్ధపడేవారు ముస్లిములు. కాబట్టి ఆయన నోట ఏదైనా ఆదేశం వెలువడగానే సహాబా (ర) ఆ ఆదేశ పాలన కోసం పరుగుదీసేవారు. మార్గదర్శకానికి, ప్రబోధించడానికి ఏవైనా పలుకులు పలికితే వారు దాన్ని స్వీకరించడానికి, ఆచరించడానికి ఒకరికంటే ఒకరు ముందుకు వచ్చేవారు.

ఇలాంటి ప్రయత్నాల ఫలితంగానే మహాప్రవక్త (స) మదీనాలో, చరిత్రలోనే అత్యుత్తమమైన, గౌరవప్రదమైన ఓ సమాజాన్ని నెలకొల్పడంలో కృతకృత్యులయ్యారు. ఓ సుదీర్ఘ కాలం వరకు కాలచక్రం క్రింద నలిగిపోయి దారి కానరాకుండా అంధకార సాగరంలో మునిగిపోయిన మానవాళికి ఈ సమాజం కారణంగా తమ సమస్యలను పరిష్కరించుకునే ఓ అమూల్య అవకాశం లభించింది. ఈ సమాజం ఏర్పడిన తరువాత మానవతకు సాంత్వన చేకూరినట్లయింది.

ఈ సమాజానికి చెందిన ఈ సహాబా (ర) మహోన్నత బోధనల ద్వారా సంపూర్ణ శక్తిగా రూపొంది తమ ధైర్యస్థైర్యాలతో ప్రపంచాన్నే ఎదుర్కొని చరిత్ర గమనాన్నే పూర్తిగా మార్చివేయడం జరిగింది.